# విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలి




**గుంటూరు , పెన్ పవర్ ఆగస్టు 24:** పెదనందిపాడు మండలం అన్నపర్రు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌ను ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, మౌలిక వసతులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ప్రహరీ తదితర సౌకర్యాలపై ఉపాధ్యాయులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యాభ్యాసం, సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. బూర్లరామాంజనేయులు మాట్లాడుతూ.. నేటి విద్యార్థులే రేపటి సమాజానికి నాయకులని అన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి వేసే ప్రతి అడుగు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానిక ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

## రామానుజ కూటమి అమాల్గమేషన్

# రద్దు ఆర్డర్‌ను పునఃపరిశీలించాలి

- శివాలయం, ఆంజనేయ స్వామి ఆలయాల నిర్మాణం పూర్తి చేయాలి
- సూర్యలంకలో బాపట్ల ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కృషి చేయాలి
- కోన రఘుపతి



**బాపట్ల:( పెన్ పవర్) ఆగస్టు 24 బాపట్ల**

మాకర్లవారి రామానుజ కూటమికి సంబంధించి గతంలో తీసుకున్న అమాల్గమేషన్ ఆర్డర్‌ను రద్దు చేస్తూ, భక్తులకు, బాపట్ల ప్రజలకు సరైన సమాచారం లేకుండా కొత్త ఆర్డర్ తీసుకురావడం తీవ్రంగా కలత కలిగించే విషయమని మాజీ ఉపసభాపతి, మాజీ బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి అన్నారు. దశాబ్దాలుగా రామానుజ కూటమి ఏ విధంగా క్షీణదశకు చేరుకుందో బాపట్ల ప్రజలందరికీ తెలుసని ఆయన పేర్కొన్నారు. మాకర్లవారు ఏర్పాటుచేసిన కూటమి ఆశయాలను కొనసాగించడంతో పాటు, బాపట్ల క్షేత్రపాలకుడైన శ్రీ భావనారాయణ స్వామి దేవస్థానం అభివృద్ధికి శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో గతంలో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తాను డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలో ఎండోమెంట్ శాఖ అధికారులతో సంప్రదించడంతో పాటు, బాపట్లకు చెందిన మాకర్లవారి కుటుంబాలకు, కూటమితో అనుబంధం ఉన్నవారికి, భక్తులకు సంబంధించిన వర్గాలతో చర్చించి ఒక శాశ్వత పరిష్కారం కోసం అమాల్గమేషన్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లినట్లు కోన రఘుపతి వివరించారు. శిథిలావస్థకు చేరిన పాత రామానుజ కూటమి స్థానంలో టీటీడీ ఆలయ సత్రాలను తలపించే విధంగా ఆధునిక సౌకర్యాలతో ఒక అద్భుతమైన భవనాన్ని నిర్మించామని ఆయన తెలిపారు. ఆ భవన నిర్మాణంలో భావనారాయణ స్వామికి సంబంధించిన భక్తుల విరాళాలు కూడా ఉన్నాయన్న సంగతి మనము మరువకూడదు. ఆ భవనాన్ని బ్యాంకుకు అద్దెకు ఇవ్వడం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఒకవైపు శ్రీ భావనారాయణ స్వామి దేవస్థానం అభివృద్ధికి, మరోవైపు మాకర్లవారి ఆశయాల సాధనకు ఉపయోగపడేలా శాశ్వత ఆదాయ వనరుగా రూపొందించినట్లు చెప్పారు. ఇటువంటి నిర్ణయాలు ఏ ఒక్కరివో కొంతమంది ఓ కాకుండా, బాపట్ల వాసుల మరియు భక్తుల అభిప్రాయాన్ని పరిగణన లోకి తీసుకొని చేయవలసిన నిర్ణయం. గతంలో కంటే మెరుగుగా ఆలోచించి, ఆ సత్ర నిర్వహణలో లోటుపాట్లు ఉంటే ఎండోమెంట్ శాఖ వారితో కూడా చర్చించి అదేవిధంగా భక్తులు మరియు కమిటీలతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని ఇటువంటి ఆర్డర్ల ద్వారా మొత్తం దేవాలయ నిర్వహణలో మాకర్ల వారే ఆశయాలను డోలాయమానంలో పడేయకూడదు. అదేవిధంగా భక్తులకు, వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించే వారికి వసతి కల్పించడం, ఎండోమెంట్ శాఖకు కార్యాలయ గది ఏర్పాటు చేయడం, చిన్న ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేయడం వంటి అనేక సౌకర్యాలను కల్పించామని, ఇవన్నీ బాపట్ల ప్రజలు ప్రత్యక్షంగా గమనిస్తున్నారని అన్నారు. శివాలయం, ఆంజనేయ స్వామి ఆలయాల నిర్మాణం పూర్తి చేయాలిబాపట్లలో భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న శివాలయం, ఆంజనేయ స్వామి దేవాలయాల నిర్మాణాన్ని కూడా పూర్తి చేసే విధంగా ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకోవాలని కోనా రఘుపతి కోరారు. మనం అభివృద్ధి చేయాలనుకోవడమే కాదు. అభివృద్ధి చేతల్లో కనిపించాలి” అని ఆయన అన్నారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనకు ఇప్పటికే రెండున్నర సంవత్సరాలు గడిచాయని, ఇకనైనా భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న ఈ అంశాలను త్వరితగతిన పరిష్కరించి, ఆలయాల నిర్మాణాలను పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సూర్యలంకలోనే బాపట్ల ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలి. బాపట్ల పర్యాటక రంగం అభివృద్ధికి అత్యంత కీలకమైన అంశంగా విమానాశ్రయం ఏర్పాటును పరిగణించాలని కోన రఘుపతి అన్నారు. తమ హయాంలో ప్రతిపాదించిన విధంగానే బాపట్ల సూర్యలంకలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రతిపాదనను కేవలం రాజకీయ అంశంగా



కాకుండా బాపట్ల భవిష్యత్ అభివృద్ధి, పర్యాటక రంగం, ఆర్థికాభివృద్ధికి సంబంధించిన ముఖ్యమైన అంశంగా చూడాలని అన్నారు. “బాపట్ల అభివృద్ధి కోసం పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లడానికి మేము సిద్ధంగా ఉన్నాం. బాపట్ల అభివృద్ధి కోసం అవసరమైన ప్రతి అంశంలో సహకరించడానికి సిద్ధంగా ఉన్నాం” అని కోనా రఘుపతి స్పష్టం చేశారు. అమాల్గమేషన్ రద్దుపై పునఃపరిశీలన చేయాలిఇలాంటి పరిస్థితుల్లో అమాల్గమేషన్‌ను రద్దు చేయడం ద్వారా శ్రీ భావనారాయణ స్వామి దేవస్థానం నిర్వహణకు, మాకర్లవారి ఆశయాలకు తూట్లు పొడిచినట్లవుతుందని తాను ఇప్పటికే స్పష్టంగా చెప్పినట్లు కోన రఘుపతి పేర్కొన్నారు. ఈ అంశంపై కొంతమంది బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ద్వారా జరుగుతున్న ప్రయత్నాలపై తాను వారితో మాట్లాడినట్లు, అలాగే బాపట్ల శాసనసభ్యులతో కూడా ఈ విషయంపై చర్చించినట్లు తెలిపారు. “నాకు ఎటువంటి వ్యక్తిగత స్వార్థం లేదు. బాపట్ల అభివృద్ధి తప్ప మరే ఇతర ఉద్దేశం లేదు” అని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి సున్నితమైన, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన అంశాల్లో అన్ని పార్టీలకు చెందినవారిని, మాకర్లవారి కుటుంబ సభ్యులను, భక్తులను, సంబంధిత వర్గాలను సంప్రదించి ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికైనా మించిపోయింది ఏమీ లేదని, సంబంధిత వారందరితో సమగ్రంగా సంప్రదింపులు జరిపి, ఇప్పటికే తీసుకువచ్చిన రద్దు ఆర్డర్‌ను పునఃపరిశీలించే దిశగా ప్రభుత్వం, అధికారులు ముందడుగు వేయాలని బాపట్ల వాసిగా, శ్రీ భావనారాయణ స్వామివారి భక్తుడిగా ఆకాంక్షిస్తున్నట్లు కోన రఘుపతి తెలిపారు.

## ఇంటింటికి కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి

# ,ఎమ్మెల్యే రామాంజనేయులు




గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 24,

ప్రత్తిపాడు నియోజకవర్గం, పెదనందిపాడు మండలం,పాలపర్రు గ్రామంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన రెండేళ్ల నమ్మకం సంక్షేమ విజయాలు, ప్రజా పాలన ఇంటింటికీ అభివృద్ధి” కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా . బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగుతోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కృషీ చేస్తోందన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. గ్రామ స్థాయిలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, కరపత్రాలను అందజేస్తూ ఎమ్మెల్యే గారు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామస్తులు తమ సమస్యలను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ స్థాయి నాయుకులు పాల్గొన్నారు.

# చినుకు పడితే చిత్తడే.. విద్యార్థులకు తప్పని తిప్పలు

**రెడ్డిపాలెంఖాజీపాలెం రహదారిలో నిలిచిన వర్షపు నీరు । కప్పలవారిపాలెం వద్ద దారుణ పరిస్థితి । అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆవేదన**

**బాపట్ల ( పెన్ పవర్) ఆగస్టు 24**

బాపట్ల జిల్లాలో పిట్టల వాని పాలెం మండలం లోని రెడ్డి పాలెం గ్రామంలో చినుకు పడితే చాలు.. రోడ్డు చెరువును తలపిస్తోంది. రెడ్డిపాలెం నుంచి కాజీ పాలెం వెళ్లే ప్రధాన రహదారిలోని కప్పలవారిపాలెం గ్రామం వద్ద వర్షపు నీరు భారీగా నిలిచిపోవడంతో విద్యార్థులు, వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ పాఠశాలలకు వెళ్లే విద్యార్థిని, విద్యార్థులు ఈ నీటిని దాటుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వర్షం పడిన ప్రతిసారీ రహదారి మొత్తం నీటితో నిండిపోవడంతో ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ రోడ్డు ఉందో తెలియని పరిస్థితి ఏర్పడుతోంది. చిన్నపిల్లలు జారి పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**హాస్పిటల్‌కు వెళ్లాలన్నా.. ఇదే అవస్థ!**

నిలిచిన నీటికి కూతవేటు దూరంలోనే ఆసుపత్రి ఉన్నప్పటికీ, అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లే రోగులు, వారి బంధువులు కూడా ఈ రహదారి పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీరు తొలగించేందుకు, రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఏళ్లుగా సమస్య ఉన్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. ప్రజలు, విద్యార్థుల భద్రతపై అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై నిలిచే వర్షపు నీటికి శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, అవసరమైన డ్రైనేజీ ఏర్పాట్లు



చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత మేల్కొనే బదులు.. ముందుగానే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఆహార, తాగునీటి పరిశుభ్రతపై విస్తృత తనిఖీలు



**విజయవాడ, పెన్ పవర్, ఆగస్టు 23:**

ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ. శ్రవణ్ బాబు ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ ఆదేశాల ప్రకారం విజయవాడలోని గిరిపురంఈట్ స్ట్రీట్, మొగల్రాజపురం, దుర్గాపురం, రాజరాజేశ్వరిపేట ప్రాంతాల్లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాంసం, చికెన్ దుకాణాలు, పానీపూరి, చాట్ మసాలా బండ్లు, ఫ్రూట్ జ్యూస్ స్టాల్స్, తాగునీటి ఆర్వో ప్లాంట్లను అధికారులు తనిఖీ చేశారు. పరిసరాల పరిశుభ్రత, తాగునీటి నాణ్యత, ఆహార పదార్థాల పరిశుభ్రత, చేతుల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. పరిశుభ్రతా ప్రమాణాలు పాటించకపోతే ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడటంతో పాటు అతిసార కేసులు ప్రబలే అవకాశం ఉందని అధికారులు వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్రజలకు పరిశుభ్రమైన ఆహారం, సురక్షితమైన తాగునీటిని మాత్రమే అందించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత శాఖల ద్వారా చట్టపరమైన చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రతి ప్రోగ్రాం అధికారి తమ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, ఆహార పదార్థాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఏదైనా అతిసార కేసు నమోదైన వెంటనే కలుషితానికి కారణమైన మూలాన్ని గుర్తించి, తక్షణ చర్యలు చేపట్టి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు.




# నోటీసు జారీ.. ఓటు తొలగింపు కాదు

## కలెక్టర్ డా. జి. లక్ష్మీశ




**విజయవాడ, పెన్ పవర్, ఆగస్టు 24:**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్)లో భాగంగా జారీ చేస్తున్న నోటీసులపై ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ స్పష్టం చేశారు. నోటీసు జారీ అంటే ఓటు తొలగింపు కాదని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం పరిధిలోని అయ్యప్పనగర్ స్వర్ణ వార్డు కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ఎస్-ఎస్ఆర్ నోటీసుల విచారణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. విచారణకు వచ్చిన ఓటర్లతో మాట్లాడి, బీఎల్‌వోలు, ఏఈఆర్‌వోలు, ఈఆర్‌వోల ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటుహక్కు పరిరక్షణ కోసమే సమగ్ర సవరణ ప్రక్రియ చేపడుతున్నామని చెప్పారు. దోషరహిత ఓటర్ల జాబితా రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇప్పటివరకు 1,88,769 నోటీసులు పంపిణీ చేయగా, 61,284 మందికి విచారణ పూర్తయిందని తెలిపారు. మరో 64,252 మందికి విచారణ షెడ్యూల్ గడువు ముగియడంతో రీషెడ్యూల్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఓటర్లకు ఏవైనా సందేహాలు ఉంటే క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు ఫారం-6, ఇతర మార్పులు, అభ్యంతరాల కోసం ఫారం-7, ఫారం-8 అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను తదితరులు ఉన్నారు.



# ప్రజల సంతృప్తే పీజీఆర్ఎస్‌కు

## అసలైన కొలమానం కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్, ఆగస్టు 24:**

ప్రజల ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో వాస్తవంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా స్నేహపూర్వక పీజీఆర్ఎస్‌లో మొత్తం 192 అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ 66, పురపాలకపట్టణాభివృద్ధి 52, పోలీస్ 22, పంచాయతీరాజ్ 17 అర్జీలు వచ్చాయి. ఫిర్యాదులను కేవలం ఆన్‌లైన్‌లో నమోదు చేయడం కాకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ సూచించారు. ఫిర్యాదుదారులతో అధికారులు నేరుగా మాట్లాడి, పరిష్కారంపై వారి సంతృప్తిని నిర్ధారించుకోవాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్‌ను ప్రజలకు అండగా నిలిచే సమర్థవంతమైన వ్యవస్థగా బలోపేతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.



## గుంటూరులో సింగిల్ యూజ్
# ప్లాస్టిక్‌పై కఠిన చర్యలు





**గుంటూరు, పెన్ పవర్, ఆగస్టు 24:**
గుంటూరు నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై పూర్తి స్థాయిలో నిషేధం అమల్లో ఉందని నగర పాలక సంస్థ కమిషనర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై 'స్వచ్ఛ యాప్' ద్వారా తక్షణమే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.
గత నెల రోజులుగా దుకాణదారులు, వ్యాపారులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇకపై ప్లాస్టిక్‌ను వినియోగించినా, విక్రయించినా, నిల్వ చేసినా, పంపిణీ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పునరావృతంగా నిబంధనలు ఉల్లంఘిస్తే ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, స్పూన్లు, ఫోర్కులు, స్ట్రాలు, థర్మాకోల్ వస్తువులు తదితర నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించనున్నాయి. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, 60 జీఎస్ఎం కంటే తక్కువ నాన్-వోవెన్ బ్యాగులు, 100 మైక్రాన్ల కంటే తక్కువ ప్లాస్టిక్/పీవీసీ బ్యానర్ల వినియోగం నిషేధమని అధికారులు తెలిపారు. ప్రజలు ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ, జూట్ బ్యాగులను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.

# ఈతేరులో ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా విచారణ



**బాపట్ల( పెన్ పవర్),ఆగస్టు 24:**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా బాపట్ల మండలం ఈతేరు గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 8లో సోమవారం విచారణ నిర్వహించారు. తార్కిక వ్యత్యాసాలు, మ్యాపింగ్ కాని ఓటర్ల నమోదుకు సంబంధించి నోటీసులు అందుకున్న 139 కేసులను తహసీల్దార్ సలీమా పర్యవేక్షణలో విచారణకు స్వీకరించారు. నోటీసులు అందుకున్న వ్యక్తులు విచారణకు హాజరై తమ వివరణలతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పించారు.
అధికారులు సమర్పించిన పత్రాలను పరిశీలించి, ఎన్నికల రికార్డులతో వివరాలను సరిపోల్చి తదుపరి చర్యలు చేపట్టారు. ప్రతి కేసును విడివిడిగా పరిశీలిస్తూ, ఓటర్ల జాబితాలోని వ్యత్యాసాలు, మ్యాపింగ్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించే ప్రక్రియను కొనసాగించారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటర్ల జాబితాలో స్థానం కల్పించడంతో పాటు జాబితా ఖచ్చితత్వం, పారదర్శకత, సంపూర్ణతను నిర్ధారించడమే విచారణ ఉద్దేశమని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మణికంఠ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా భద్రతపై అవగాహన కల్పించిన పోలీసులు



**పిట్టలవానిపాలెం: ( పెన్ పవర్), ఆగస్టు24**
బాపట్ల జిల్లా పిట్టల వాని పాలెం మండలం లోని గ్రామాన్నిఛందోలు ఎస్ఐ మాధవరావు ఆధ్వర్యంలో పోలీసులు సందర్శించి గ్రామస్తులతో సమావేశమై ప్రజా భద్రత, చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు శాంతియుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు.అలాగే సిరోరక్షప్రాణ రక్ష కార్యక్రమం, గంజాయి తదితర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై గ్రామస్తులకు వివరించారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, వాటి విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.మహిళలపై జరిగే నేరాల నివారణ, మహిళల భద్రతకు పోలీస్ శాఖ అందిస్తున్న సహాయంపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులు, ఫోన్ కాల్స్, సందేశాలను నమ్మి వ్యక్తిగత లేదా బ్యాంకు వివరాలను వెల్లడించవద్దని సూచించారు.గ్రామంలో ప్రజా భద్రతను మరింత పటిష్టం చేసేందుకు ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై కూడా గ్రామస్తులతో చర్చించారు. సీసీటీవీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణతో పాటు నేరాలకు పాల్పడే వారిని గుర్తించడంలో పోలీసులకు సహకారం లభిస్తుందని తెలిపారు.ప్రజలు పోలీసులకు సహకరిస్తూ గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు భాగస్వాములు కావాలనిఛందోలు ఎస్ఐ మాధవరావు కోరారు.

## రూ.47 లక్షల పంచాయతీ నిధుల దుర్వినియోగం కేసు
# వైకాపా నేత కోటిరెడ్డి దంపతుల అరెస్ట్



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, ఆగస్టు 24 :**
నాదెండ్ల : మండలం చిరుమామిళ్ల పంచాయతీలో రూ. 47 లక్షల నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కేసులో మాజీ సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మి, ఆమె భర్త, వైకాపా నాయకుడు సింగారెడ్డి కోటిరెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అవకతవకలపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో డిప్యూటీ ఎంపీడీవో విచారణ జరిపి నిధుల దుర్వినియోగాన్ని నిర్ధారించారు. కలెక్టర్ ఆదేశాలతో పోలీసులు కేసు నమోదు చేయగా, గత నెల 19 నుంచి పరారీలో ఉన్న ఈ దంపతులు ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించినా ఊరట లభించలేదు. తాజాగా నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు.

# అర్జీదారుల సమస్యలను వేగంగా పరిష్కరించాలి





**గుంటూరు,**
**పెన్ పవర్, ఆగస్టు 24:**
సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ ఆదేశించారు. ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సూచించారు.కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ సాయికాంత్ వర్మతో పాటు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలి, డీపీఓ సాయికుమార్ తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని అధికారులను ఆదేశించారు. అర్జీలపై క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారణ జరిపి,న్యాయబద్ధంగాపరిష్కరించాలన్నారు. ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడమే పీజీఆర్ఎస్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.అర్జీదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక క్యూ లైన్లు, తాగునీరు, ఉచిత భోజన సదుపాయాలతో పాటు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. అవసరమైన ప్రాథమిక వైద్య సేవలను కూడా అందుబాటులో ఉంచారు.కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గణేశ ఉత్సవాలకు ముందస్తు సమన్వయంతో ఏర్పాట్లు



**గుంటూరు,పెన్ పవర్,ఆగస్టు 24,**
గణేశ ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించేందుకు ముందస్తు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గణేశ ఉత్సవ సమితి రాష్ట్ర సమావేశం తీర్మానించింది. గుంటూరులోని మల్లెనేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సమితి అధ్యక్షులు గోకరాజు గంగరాజు, అధ్యక్షులు చలసాని ఆంజనేయులు అధ్యక్షతన సమావేశం జరిగింది. 2025లో గణేశ మండపాల నిర్వాహకులకు సింగిల్ విండో అనుమతులు, అవసరమైన సదుపాయాలు, ఉచిత విద్యుత్ కల్పించిన ప్రభుత్వానికి సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. 2026 ఉత్సవాలకు జిల్లాల వారీగా ముందస్తు సమన్వయ సమావేశాలు నిర్వహించాలని, మండలమున్సిపల్ స్థాయిలో నోడల్ అధికారులను నియమించాలని కోరింది.మండపాల నమోదు, ఉచిత విద్యుత్ కోసం సింగిల్ విండో విధానాన్ని ముందుగానే ప్రారంభించాలని, నిమజ్జన ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, మంచినీరు, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, క్రేన్లు, శిక్షణ పొందిన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించింది. భక్తులు పవిత్ర భావంతో, శాంతియుతంగా నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొనాలని సమితి పిలుపునిచ్చింది.సమావేశంలో ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ విజయ ఆదిత్య, సమితి కార్యదర్శి త్రినాథ్, లక్ష్మీపతి, జిల్లా అధ్యక్షులు మల్లినేని పరమేశ్వరరావు, నగర అధ్యక్షులు పుణుగుళ్ల రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## యువ వాలంటీర్ల దరఖాస్తు గడువు ఆగస్టు 27 వరకు పొడిగింపు



**విజయవాడ , పెన్ పవర్,ఆగస్టు 24:**
భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మేరా యువ భారత్ సంస్థ యువ వాలంటీర్ల దరఖాస్తుల గడువును ఆగస్టు 27, 2026 వరకు పొడిగించినట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా చేపడుతున్న ఈ నియామక కార్యక్రమం ద్వారా జాతీయ అభివృద్ధి, సామాజిక సంక్షేమ కార్యక్రమాల్లో యువత చురుకుగా భాగస్వాములు కావడానికి అవకాశం కల్పిస్తోంది.

**అర్హతలు**

18 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి. కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పూర్తికాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు కారు. గతంలో జాతీయ యువ వాలంటీర్లుగా పనిచేసి పదవీకాలం పూర్తికాకముందే మధ్యలో వైదొలిగిన వారు, అలాగే ఇప్పటికే పదవీకాలం పూర్తి చేసిన వారు తిరిగి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు కారు.

**ఎంపిక ప్రక్రియ**

సంబంధిత జిల్లా యువ అధికారి అధ్యక్షతన, ఇద్దరు స్థానిక ప్రముఖ రంగ నిపుణులతో కూడిన జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది.
ప్రతి మండలానికి ఇద్దరు యువ వాలంటీర్లు నిర్దేశిత అన్ని మేరా యువ భారత్ కేంద్ర జిల్లాల్లో ప్రతి మండలానికి ఇద్దరు యువ వాలంటీర్లను నియమిస్తారు. ప్రస్తుతం కేంద్రాలు లేని కొత్త జిల్లాల్లో ముగ్గురు వాలంటీర్లను నియమిస్తారు. కంప్యూటర్, పత్రాల నిర్వహణలో నైపుణ్యం కలిగిన మరో ఇద్దరు వాలంటీర్లను ప్రతి కేంద్ర స్థాయిలో నియమిస్తారు.నెలకు రూ.5 వేల గౌరవ వేతనం ఎంపికైన అభ్యర్థులను 202627 కాలానికి నియమిస్తారు. పనితీరు ఆధారంగా మరో ఏడాది పాటు పదవీకాలాన్ని పొడిగించే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ విధానాలు, యువజన కార్యక్రమాలు, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో వాలంటీర్లు కీలక పాత్ర పోషించాలి. సామాజిక మాధ్యమాల ద్వారా కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయగల సామర్థ్యం ఉండాలి.ఎంపికైన ప్రతి వాలంటీర్‌కు నెలకు రూ.5,000 గౌరవ వేతనం అందజేస్తారు.దరఖాస్తులకు చివరి తేదీ ఆగస్టు 27 ఆసక్తి, అర్హత కలిగిన యువత ఆగస్టు 27లోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. దరఖాస్తు కోసం నేషనల్ యూత్ కార్ప్స్ దరఖాస్తు వెబ్‌సైట్ను సందర్శించాలి.మరిన్ని వివరాలు, సహాయం కోసం అభిరామ్ 6304283460 నంబర్‌లో సంప్రదించవచ్చు.

## నాటిన ప్రతి మొక్కను కాపాడాలి
# జిల్లా కలెక్టర్ సీ.ఎం. సాయి కాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 24,**
గ్రీన్ గుంటూరు కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను కచ్చితంగా సంరక్షించాలని జిల్లా కలెక్టర్ సీ.ఎం. సాయి కాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. మొక్కల సంరక్షణపై త్వరలో ఆడిట్ నిర్వహిస్తామని తెలిపారు.జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతితో పాటు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లపై ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎస్ఐఆర్‌లో నోటీసులు అందుకున్న వారికి నిర్దేశిత గడువులో విచారణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. విచారణను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం ఎలాంటి జాప్యం లేకుండా నిర్వహించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను వేగవంతం చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు.అక్షరాంధ్ర కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లాలో గుర్తింపు కార్డులు లేని యానాది కుటుంబాలను గుర్తించి వారికి ఆధార్ కార్డులు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.గ్రీన్ గుంటూరు కార్యక్రమంపై సమీక్షిస్తూ పచ్చదనం పెంపు, మొక్కల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. వీబీజీ రామ్‌జీ తదితర అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని కూడా సమీక్షించి, నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలి, ఇతర అధికారులు పాల్గొన్నారు.




# పంట నమోదును వేగవంతం చేయాలి
## పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఎం. జగ్గారావు



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, ఆగస్టు 24 :**
ఎడ్లపాడు: గ్రామంలో జరుగుతున్న పంట నమోదు (ఈ-పంట) ప్రక్రియను పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఎం. జగ్గారావు ఆకస్మికంగా తనిఖీ చేసి, పంటల స్థితిగతులను పరిశీలించారు. నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వచ్చే నెల 15వ తేదీ నాటికి పక్కా ప్రణాళికతో లక్ష్యాన్ని పూర్తి చేయాలని గ్రామ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతులు స్వయంగా 'ఏపీ ఏఐఎంఎస్ 2.0' (ఫార్మర్ యాప్) ద్వారా తమ పంట వివరాలను నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎ. హరిప్రసాద్, ఏఈఓ జీవన్ నాయక్, గ్రామ వ్యవసాయ సహాయకుడు బిలాల్ మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# మద్యం మాఫియా డాన్ జగన్ ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 24,**

మద్యం అక్రమాల వంటి దురాగతాలతో దొంగలు ముఠా నాయకుడిగా జగన్ ఎదిగారని, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దీనికి నిదర్శనమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ విమర్శించారు. రాష్ట్రంలో మద్యం విక్రయాల విషయంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరావు అరెస్టు వైసీపీకి చెంపపెట్టు అన్నారు. ఈ మేరకు సోమవారం ఓ పత్రిక ప్రకటనలో విమర్శించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో మద్యం పాలసీని అడ్డుపెట్టుకుని వేల కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడ్డారని విమర్శించారు. ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ డిపోల నుంచి మద్యం దుకాణాలకు సరుకు రవాణాలోనూ అక్రమాలలకు ఒడిట్టారన్నారు. మద్యం విక్రయాలలో ఇష్టరీతిగా వ్యవహరించి ప్రజల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. కల్తీ మద్యాన్ని సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాటారని విమర్శించారు. గంజాయి బ్యాచ్ ని ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో అరాచకాలకు పాల్పడ్డారన్నారు. ఇలాంటి నాయకులు కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మద్యం అక్రమాల ద్వారా వచ్చిన డబ్బు తాడేపల్లి ప్యాలెస్ కు చేరిందని ఆరోపించారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం నుంచి పరిశ్రమలు పారిపోయాయని, విద్యార్థుల జీవితాలను సర్వనాశనం చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం తీసుకొచ్చారని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆశయంలో భాగంగా యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తున్నామని, గత వైసిపి పాలనలో యువత భవితను గంజాయి మత్తులో నాశనం చేశారని మండిపడ్డారు. వైసీపీని రాష్ట్రం నుంచి ప్రజలు తరిమికొట్టే రోజులు



ముందున్నాయని చెప్పారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి రూ.30 వేల జరిమానా




**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 24 :**

చిలకలూరిపేట : పట్టణంలో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు స్థానిక న్యాయస్థానం భారీ జరిమానా విధించింది. పట్టణ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన నిందితులను పేట కోర్టులోని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ. 10,000 చొప్పున ముగ్గరికి మొత్తం రూ. 30,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్పందిస్తూ, జరిమానా పడిన వ్యక్తులు మరోమారు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే ఉపేక్షించేది లేదని, నేరుగా జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అమృత పథకం మొదటి దశ,రెండో దశ పనులు
# త్వరితగతిన పూర్తి చేయాలి మాజీమంత్రి ప్రత్తిపాటి.

- 1500 మంది టిడ్కో లబ్ధిదారుల రుణ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ప్రత్తిపాటి.
- బ్యాంకర్లతో మాట్లాడి అర్హులైన వారికి రుణాలు మంజూరయ్యేలా చూస్తానని ప్రత్తిపాటికి హామీ ఇచ్చిన నారాయణ.
- మున్సిపల్ అధికారులతో పట్టణాభివృద్ధి, ప్రజా సమస్యలపై ప్రత్తిపాటి సమీక్ష.
- క్షేత్రస్థాయి పరిశీలనతో ఎప్పటికప్పుడు సమస్యలు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ కు ప్రత్తిపాటి ఆదేశం.



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 24 :**

చిలకలూరిపేట : పట్టణాభివృద్ధి విషయంలో ప్రజల అసంతృప్తి, ఆగ్రహానికి కారణమైన ప్రధాన గుత్తేదారు సంస్థ పనితీరుని గమనించాలని , అమృత్ -1 లోభాగంగా దక్కించుకున్న మంచినీటి పైప్ లైన్ ఏర్పాటు పనుల్ని అసంపూర్తిగా వదిలేసి, తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన సంస్థ తీరుపై ప్రజాభిప్రాయానికి విలువ ఇవ్వాలని, చిలకలూరిపేట మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన నిధుల్ని సకాలంలో మంజూరు చేయాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు విజ్ఞప్తి చేశారు.

సోమవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి.. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చిలకలూరిపేట పట్టణాభివృద్ధి, ప్రజా సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి పట్టణ ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారంలో యంత్రాంగం ఉదాసీనతపై అసహనం వ్యక్తం చేశారు. పట్టణ ప్రజల అసంతృప్తికి కారణమైన ప్రధాన గుత్తేదారు సంస్థ పనితీరుపై సమావేశంలోనే ప్రత్తిపాటి.. మంత్రికి ఫిర్యాదు చేశారు.

**అసంపూర్తిగా ఉన్న అమృత్ తొలిదశ.. త్వరలో చేపట్టే రెండో ధశ పనులన్నీ సకాలంలో పూర్తయ్యేలా చూడండి.**

2014-19 మధ్య అమృత్ పథకంలో చేపట్టిన ప్రధాన తాగునీటి పైప్ లైన్ ఏర్పాటులో గుత్తేదారు సంస్థ నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంపై చిలకలూరిపేట ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి, మంత్రి నారాయణకు ఫిర్యాదు చేశారు. 8 సంవత్సరాలుగా పైప్ లైన్ పనులు అసంపూర్తిగా వదిలేయడం, వేసిన పైపుల నుంచి నీటి లీకేజీ సమస్యలు ప్రజల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేశాయని ప్రత్తిపాటి మంత్రి నారాయణకు తెలియచేశారు. నిర్దేశించిన లక్ష్యం ప్రకారం, నిర్ణీత వ్యవధిలో పనులు జరగలేదని ప్రత్తిపాటి మంత్రికి తెలిపారు. గతంలో రోడ్లను ఇష్టానుసారం తవ్వేసి, పైపులు వేయకుండా, గుంతలు పూడ్చకుండా సదరు సంస్థ వ్యవహరించిన తీరుపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను అర్థం చేసుకోవాలని ప్రత్తిపాటి, మంత్రికి సూచించారు. తాజాగా అమృత్-2 పథకం పనులు మరలా అదే గుత్తేదారు సంస్థకు అప్పగిస్తే.. ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. అమృత్ తొలిదశ. త్వరలో చేపట్టే రెండోదశ పనులన్నీ సకాలంలో పూర్తిచేసేలా సదరు సంస్థకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని ప్రత్తిపాటి మంత్రిని కోరారు. ఎమ్మెల్యే సూచనలపై స్పందించిన మంత్రి నారాయణ.. సదరు సంస్థ తినిధులతో మాట్లాడి సమస్య మొత్తం పరిష్కారమయ్యేలా చూస్తానని ప్రత్తిపాటికి హామీ ఇచ్చారు. కోరినవిధంగా తొలిదశలో చేపట్టిన పనులు. త్వరలో ప్రారంభించే పనులు సకాలంలో పూర్తిచేసేలా సదరు సంస్థకు స్పష్టమైన ఆదేశాలిస్తామని మంత్రి నారాయణ, ప్రత్తిపాటికి స్పష్టత ఇచ్చారు.

**టిడ్కో లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యేలా బ్యాంకర్లతో మాట్లాడండి**

గతంలో టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో గృహాలకు ఎంపికైన లబ్ధిదారుల్లో దాదాపు 1500 మంది, వారివాటాగా చెల్లించాల్సిన సొమ్మును అప్పుడే ప్రభుత్వానికి చెల్లించారని. కానీ నాటి నుంచి నేటివరకు వారికి బ్యాంకుల రుణం మంజూరు కాలేదని సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రత్తిపాటి మంత్రి నారాయణ, రాష్ట్ర టిడ్కో ఎండీని కోరారు. స్థానిక బ్యాంకర్లతో మాట్లాడి, అర్హులైన ప్రతి లబ్ధిదారుకు రుణం అందేలా చూస్తానని, రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కరిస్తామని మంత్రి నారాయణ, ప్రత్తిపాటికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి అధికారులకు పలు సూచనలు చేశారు. టిడ్కో మొదటి దశలో పూర్తయిన ఇళ్లలో ఒక్కటి కూడా ఖాళీగా ఉండటానికి వీల్లేదని, లబ్ధిదారులు నివాసం ఉండకపోతే, తక్కువ ధరకే అద్దెకు ఇచ్చేలా చూడాలని ప్రత్తిపాటి సూచించారు. అద్దెకు తీసుకునే వారి పూర్తి వివరాలు సేకరించాలని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా, గృహాల్లోని వారికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గృహసముదాయం.. చుట్టపక్కల ప్రాంతాల్లో రాత్రిళ్లు గస్తీ సెంచేలా పోలీస్ వారితో సమన్వయం చేసుకోవాలని ప్రత్తిపాటి మున్సిపల్ అధికారుల్ని ఆదేశించారు.

**క్షేత్రస్థాయి పరిశీలనతో పారిశుధ్య సమస్యకు చెక్ పెట్టండి..**

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలు సంతృప్తిగా లేరని, ప్రభుత్వ సమాచార సేకరణలోనూ ఈ విషయం స్పష్టమైందని, చెత్త తొలగింపు, వీధుల శుభ్రత, మురుగుకాల్వల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. శానిటేషన్.. క్లోరినేషన్ తో పాటు.. దోమల బెడద లేకుండా చూడాలని, మురుగునీటి నిల్వ.. వ్యర్థాలతో ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సకాలంలో పట్టణవ్యాప్తంగా చెత్తసేకరణ, తరలింపు జరగాలని, పారిశుధ్య నిర్వహణలో ప్రజలకు ఇబ్బంది లేకుండా, ప్రణాళికాబద్ధంగా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రత్తిపాటి, మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. మరోసారి పారిశుధ్యంపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే అందరూ బాధ్యులవుతారని ఆయన హెచ్చరించారు. ఉదయాన్నేక్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లి.. సమస్యల్ని గుర్తించి వెంటనే వాటికి చెక్ పెట్టాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, కొత్త కోటేశ్వరరావు, ముల్లా కరిముల్లా, పిల్లి కోటేశ్వరరావు, యస్.యస్. సుభాని, కనమర్లపూడి రమేష్, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, డి.ఈ అబ్దుల్ రహీమ్, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీజేఏసీ అమరావతి ఉద్యమ శంఖారావం
# సదస్సుకు తరలిరావాలని పిలుపు



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 24 :**

చిలకలూరిపేట : ఆగస్టు 28న విజయవాడలో జరగనున్న ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర సదస్సు "ఉద్యమ శంఖారావం"కు ఉద్యోగులు భారీగా తరలిరావాలని పల్నాడు జిల్లా అధ్యక్షులు నాంపల్లి నాగమల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల సాధన, ఆర్థిక సమస్యల పరిష్కారం, భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేయడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అన్ని శాఖల ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్లు, మహిళా ప్రతినిధులు ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎ.సి.హెచ్.వెంకటేశ్వర్లు, జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు షేక్ రమీజా, వీఆర్వోల సంఘం అధ్యక్షులు ఆర్.రామారావు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# పేట తహసిల్దార్ కార్యాలయానికి కంప్యూటర్ల వితరణ.




**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 24 :**

చిలకలూరిపేట : స్థానిక తహసిల్దార్ కార్యాలయ కార్యకలాపాలను మరింత వేగవంతం చేసేందుకు విజయవాడకు చెందిన పినాకిల్ జూనియర్ కళాశాల యాజమాన్యం ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా సోమవారం తహసిల్దార్ కార్యాలయానికి అవసరమైన కంప్యూటర్లను వితరణగాఅందజేశారు.విజయవాడ పినాకిల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఈ కంప్యూటర్లను నేరుగా కార్యాలయానికి తీసుకువచ్చి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా తహసిల్దార్ వేణుగోపాలరావుకు మరియు కార్యాలయ పర్యవేక్షకులు (సూపర్వైజర్) వెంకటేశ్వరరావుకు ప్రత్యేకంగాకంప్యూటర్లను అందజేశారు.కార్యాలయ సిబ్బందికి డిజిటల్ సేవలు అందించడంలో, అలాగే ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత త్వరగా చేరవేయడంలో ఈ కంప్యూటర్లు ఎంతగానో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగాసమాజసేవా దృక్పథంతో ముందుకు వచ్చి తహసిల్దార్ కార్యాలయానికి కంప్యూటర్లను విరాళంగా అందజేసిన పినాకిల్ జూనియర్ కళాశాలనిర్వాహకులను తహసిల్దార్ వేణుగోపాలరావు మరియు ఇతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

# రెండేళ్ల అభివృద్ధి..పథకాలపై ప్రజల్లో అవగాహన..
# వారి సమస్యల పరిష్కారానికే ఇంటింటికీ తెలుగుదేశం : ప్రత్తిపాటి

-ప్రారంభమై నెలరోజులవుతున్నా ఇంటింటికీ తెలుగుదేశానికి అపూర్వ ప్రజాదరణ లభిస్తోంది.
-సాతులూరులో ఇంటింటికీ తెలుగుదేశం నిర్వహించిన ప్రత్తిపాటి.
- రూ.25 లక్షల జిల్లాపరిషత్ నిధులతో గ్రామంలో నిర్మించనున్న డ్రైన్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే.





**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, ఆగస్టు 24 :**

నాదెండ్ల : ప్రారంభమై నెలరోజులవుతున్నా ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమానికి లభిస్తున్న అపూర్వ ప్రజాదరణ ఏమాత్రం తగ్గలేదని, పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమయ్యేలా, ప్రభుత్వ పథకాలు, రెండేళ్ల అభివృద్ధిని వారికి వివరించేలా టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. రెండేళ్ల అభివృద్ధిని ప్రజలకు వివరించడంతో పాటు.. పథకాలపై అవగాహన ప్రజా సమస్యల పరిష్కారం దిశగా చేపట్టిన సరికొత్త కార్యక్రమం ఇంటింటికీ తెలుగుదేశమని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.సోమవారం ఆయన నాదెండ్ల మండలం సాతులూరులో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కాటి అంకమ్మ తల్లి దేవాలయాన్ని సందర్శించిన ప్రత్తిపాటి.. అక్కడ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం రూ.25 లక్షల జిల్లాపరిషత్ నిధులతో చేపట్టిన డ్రైన్ల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ.. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ.. కూటమిప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి, పాలనా విజయాల్ని వారికి వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల్ని ఉద్దేశించి ప్రత్తిపాటి మాట్లాడారు.

**సమర్థులైన పాలకులతోనే ప్రజలకు సుపరిపాలన.. రాష్ట్రానికి అభివృద్ధి**

తెలుగుదేశం అధినాయకత్వం ఆలోచనలు.. విధానాలు..ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు.. ప్రజలకు అందించే అభివృద్ధి.. పలు సందర్భాల్లో దేశానికే మార్గదర్శకంగా, స్ఫూర్తిగా నిలిచిందని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. సమర్థులైన పాలకుల అనుభవం.. ఆలోచనలు కార్యరూపం దాలిస్తే ప్రజలకు ఎటువంటి జవాబుదారీ, పారదర్శక సుపరిపాలన అందుతుందో చెప్పడానికి కూటమిప్రభుత్వ రెండేళ్ల పాలనే నిదర్శనమన్నారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ.. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వారి అభిప్రాయాలు, ఆలోచనలు తెలుసుకుంటూ.. వారి సమస్యలు పరిష్కరిస్తూ నెలరోజులుగా టీడీపీ శ్రేణులు సాగిస్తున్న కార్యక్రమం విశేషమైన ప్రజాదరణ చూరగొంటోందని ప్రత్తిపాటి చెప్పారు. ఇంటింటికీ తెలుగుదేశం ద్వారా ఎక్కడికక్కడ స్థానిక సమస్యల పరిష్కారం.. ప్రజావసరాలు.. మౌలిక వసతుల కల్పనకు కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాయకులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లడం ద్వారా.. ప్రజాస్వామ్యంపై వారికున్న నమ్మకం మరింత బలపడుతుందని ప్రత్తిపాటి తెలిపారు.

కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జార్వార్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, టీడీపీ నాయకులు నార్నే కోటయ్య స్వామి, జంపని వసంతరావు, నందిగాం శివయ్య, నార్నే శ్రీను, కమ్మ శ్రీను, ఐనవోలు రాధా, భయ్యన శ్రీను, మాధవ రావు, శివ సత్యం, సైదా, చెన్నకేశవులు, చుండి అనిల్, ఈధర సాంబశివరావు, నల్లమోతు హరిబాబు, వజ్జ సింగయ్య, పోపూరి మస్తాన్ రావు, పుల్లా రెడ్డి, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు వ్యక్తం.

# ఎస్సీ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరాలి



**పర్చూరు,పెన్ పవర్,ఆగస్టు 24:**

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందేలా చర్యలు తీసుకోవాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచించారు.సోమవారం తాడేపల్లిలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ఏలూరి సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్, పర్చూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ శంకర్‌శెట్టి చిరంజీవి పూల మొక్కను అందించి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.అనంతరం ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. పథకాల అమలు తీరు, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలు, ఎదురవుతున్న సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన వారికి సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోరారు. పథకాల అమలులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి పూర్తి ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో భాగంగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు 'ప్రకాశం డిస్ట్రిక్ట్ గెజిటీర్లు' పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై చర్చించారు.

# ఎన్నికల వేళ పోలీసుల అప్రమత్తత.. చీరాలలో విస్తృత తనిఖీలు



**చీరాల, పెన్ పవర్ ఆగస్టు 24:**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చీరాల రెండో పట్టణ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు చర్యల్లో భాగంగా జాన్‌పేట, జయంతిపేట ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.ఎస్పీ బి. ఉమా మహేశ్వర్, డీఎస్పీ ఎం.డి. మొయిన్ ఆదేశాల మేరకు రెండో పట్టణ సీఐ శశికుమార్ ఆధ్వర్యంలో సుమారు 20 మంది పోలీసు సిబ్బందితో ఫుట్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్ల వద్ద ఆకస్మిక తనిఖీలు చేపట్టి, పలువురికి కౌన్సిలింగ్ నిర్వహించారు.తనిఖీల్లో సరైన పత్రాలు లేని 50 బైక్‌లను గుర్తించిన పోలీసులు వాటిని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, అవాంఛనీయ ఘటనలకు పాల్పడవద్దని సీఐ శశికుమార్ హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

## ఓటర్ల జాబితా, గ్రామ పంచాయతీ ఎన్నికలు,

# తాగునీటి సమస్యలపై కలెక్టర్ సమీక్ష

- తొలగించే ఓటర్ల వివరాలు పక్కాగా నమోదు చేయాలి
- పంచాయతీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల ల ముసాయిదా జాబితా విడుదల
- గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండకూడదు
- అవసరమైన చోట కొత్త బోర్లు వేయాలి
- కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్






**బాపట్ల:( పెన్ పవర్), ఆగస్టు24**

బాపట్ల ఓటర్ల జాబితా సవరణ, గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సోమవారం కలెక్టరేట్‌లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో వరుసగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ, మ్యాపింగ్ ప్రక్రియపై ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలు, డీపీఓ, ఎంపీసీలు, ఎంపీడీఓలు, సమీక్షించారు. ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రతి ఓటరుకు జారీ చేసిన నోటీసుల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు.ఓటరు అందుబాటులో లేని సందర్భంలో వారి కుటుంబ సభ్యులు, బంధువుల ద్వారా వివరాలు సేకరించాలని సూచించారు. ఓటరు ఇంటి వద్ద అందుబాటులో లేకపోతే డోర్ నోటీసు అతికించి, కుటుంబ సభ్యులు లేదా బంధువుల వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ పూర్తికాని ఓటర్లకు నోటీసులు జారీ చేసి, సంబంధిత ఆధారాలను సేకరించి ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కొత్త ఓటరు నమోదుకు ఫారమ్6, విదేశాల్లో నివసించే భారతీయుల నమోదుకు ఫారమ్6ఏ, పేర్ల తొలగింపు, అభ్యంతరాలకు ఫారమ్7, వివరాల సవరణ, నివాస మార్పు తదితరాలకు ఫారమ్8 ద్వారా ఈఆర్‌వో, ఏఈఆర్‌వో, బీఎల్‌వో కార్యాలయాల్లో లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు . సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లవన్న , ఎలక్షన్ సూపరిడెంట్ షఫి మిగతా తదితర అధికారులు పాల్గొన్నారు.

**గ్రామ పంచాయతీ ఎన్నికలపై ..**

గ్రామ పంచాయతీల 2వ సాధారణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల జాబితా తయారీ, ప్రచురణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమయపట్టికను ప్రకటించింది. జనవరి 1ను అర్హత తేదీగా తీసుకుని ఏప్రిల్‌లో ప్రచురించిన ఓటర్ల జాబితా ఆధారంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఎంపిక చేసిన 20 గ్రామ పంచాయతీల్లో ఆగస్టు 17న ప్రచురించిన ఫొటో ఓటర్ల జాబితాను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు.ఆగస్టు 21 నాటికి పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా తయారీ పూర్తి కాగా, ఆగస్టు 23న ముసాయిదా జాబితాను ప్రచురించారు. జాబితాపై ఆగస్టు 26 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరిస్తారు. అందిన అభ్యంతరాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేసిన అనంతరం ఆగస్టు 29న జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆమోదం పొందనున్నారు. ఆగస్టు 31న తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రచురించనున్నారు.ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ గ్రామ పంచాయతీ, వార్డు పరిధిలోని పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే ఆగస్టు 26లోగా సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా అందజేయాలని కలెక్టర్ సూచించారు.సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ తో పాటు అన్ననిమండాలల ఎంపిడివోలు, పంచాయతి సెక్రటరిలు పాల్గొన్నారు.

**ఆర్‌డబ్ల్యూఎస్ ప్రజా సమస్యలపై సమీక్ష**

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులపై కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య ఉండకూడదని స్పష్టం చేశారు. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను వెంటనే గుర్తించి, తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అవసరమైన చోట పంచాయతీ నిధులను వినియోగించి తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రతి గ్రామంలో తాగునీటి అవసరాలను ముందుగానే గుర్తించి, అవసరమైన ప్రాంతాల్లో కొత్త బోర్లు వేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి తాగునీటికి సంబంధించిన ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేశారు.ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మాధవితో వపాటు ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ , మండల స్థాయి సిబ్బంది, పంచాయతి సెక్రటరిలు పాల్గొన్నారు.

## రామన్నపేటలో 'రెండేళ్ల నమ్మకం'..

# 500 కుటుంబాలకు కరపత్రాల పంపిణీ



**వేటపాలెం, పెన్ పవర్, ఆగస్టు 24:**

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీలో టీడీపీ ఆధ్వర్యంలో 'రెండేళ్ల నమ్మకం' కార్యక్రమాన్ని నిర్వహించారు.టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య నాయకత్వంలో 216వ బూత్ కన్వీనర్ షేక్ కరీమున్ బూత్ పరిధిలోని సుమారు 500 కుటుంబాలను ఇంటింటికీ కలిసి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విజయాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన షేక్ కరీమున్‌ను చీరాల నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు పులి హరికృష్ణ అభినందించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో పెరుగు భాస్కర్, వోలుకుల కోటయ్య, కర్ణ శ్రీనివాస్‌తో పాటు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సముద్ర తీరంలో ప్రమాదం పొంచి ఉంది.. సందర్శనకు బ్రేక్




**వేటపాలెం, పెన్ పవర్, ఆగస్టు 24:**

వేటపాలెం మండలం పొట్టి సుబ్బయ్యపాలెం సముద్ర తీరంలో సముద్రపు కోత తీవ్రత పెరగడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సముద్ర తీర ప్రాంతంలో పర్యాటకులు, సందర్శకుల ప్రవేశాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు.సముద్ర తీర పరిస్థితులు అనుకూలంగా లేని కారణంగా ప్రజలు ఎవరూ అక్కడికి వెళ్లవద్దని వేటపాలెం పోలీసులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి సముద్ర తీరానికి వెళ్లి ప్రమాదాలకు గురికావద్దని హెచ్చరించారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు తీసుకున్న చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై జనార్దన్ కోరారు.ఐ

## ఆంధ్రప్రదేశ్ డిజిటల్ & ప్రింట్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్

# రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక.




**విజయవాడ, పెన్ పవర్, ఆగస్ట్, 24,**

విజయవాడలోని ఇనాక్స్ థియేటర్ ఎదురు గా ఉన్న ఆంధ్రప్రదేశ్ డిజిటల్ & ప్రింట్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయం నందు రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర జనరల్ సెక్రటరీ వల్లూరు.మధుసూదన రావు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది..ఈ సమావేశమూకీ ఆంధ్రప్రదేశ్ డిజిటల్ & ప్రింట్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు గుండారెడ్డి మల్లికార్జున రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు..ఏపీ రాష్ట్ర అధ్యక్షులు వారి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గం ఎన్నుకోవడం జరిగింది...ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు గుండారెడ్డి మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో జర్నలిస్టుల హక్కుల సాధన కోసం,జర్నలిస్టుల భద్రత సంక్షేమం కోసం ఐక్యంగా అందరూ కలిసి పని చేయాలని,జర్నలిస్టుల అందరూ ఐక్యతగా హక్కులు సాధించుకోవాలని తెలియజేశారు..అదేవిధంగా రాష్ట్ర అధ్యక్షులు గుండారెడ్డి మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో 28 జిల్లాలో నూతన కమిటీలు ఏర్పాటు చేసుకొని నూతన అధ్యక్షులను ఏర్పాటు చేసుకోవాలని,నూతన సభ్యత్వం నమోదు కార్యక్రమం చేపట్టాలని రాష్ట్ర నాయకులకు దిశ నిర్దేశాలు చేయడం జరిగింది..అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ డిజిటల్ ప్రింట్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ వల్లూరు.మధుసూదనరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో జర్నలిస్టుల హక్కులు ఆయన అక్రిడేషన్ కార్డ్ లు సాధనకు పనిచేస్తాం అని, అదేవిధంగా అక్రిడేషన్ కమిటీలో భాగస్వామ్యం కావడానికి అందరం రాష్ట్ర లో సభ్యత్వాలను పెంచుకోవాలిసియన్ అవశ్యకత ఉందని తెలియజేశారు.. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అనిల్ కుమార్ మాట్లాడుతూ డిజిటల్ ప్రింట్ మీడియా రంగం ఇప్పుడు ఎంతో ముందు ఉందని,ఎప్పుడూ టెక్నాలజీ ప్రకారం డిజిటల్ మీడియా ప్రాధాన్యత ఎంతో అవసరం అని తెలియజేశారు...ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా మొట్ట మొదటి గా డిజిటల్ మీడియా అసోసియేషన్ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని అనిల్ కుమార్ సంతోషం వ్యక్తం చేసేరు...మన ఏపీ డిజిటల్ ప్రింట్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ సంస్థ డెవలప్మెంట్ కోసం అందరూ సభ్యత్వాలు చేయాలి అని అన్నారు..ఈ కార్యక్రమంలో నూతన ఆంధ్రప్రదేశ్ డిజిటల్ ప్రింట్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ప్రకటించడం జరిగింది .

నూతన కమిటీ:

రాష్ట్ర అధ్యక్షులు: గుండారెడ్డి మల్లికార్జున రెడ్డి

అధ్యక్షులు

సూర్య ప్రకాశరావు

ఉపాధ్యక్షులుగా రొడ్డా తిరుపతయ్య, కొండిసెట్టి. సురేష్ బాబు, గూడూరి.ప్రసాద్

జనరల్ సెక్రటరీ: వల్లూరు. మధు సుధను రావు

కోశాధికారి పి. ఎల్.శ్రీనివాసరావు

ఆర్గనైజింగ్ సెక్రటరీ

అనిల్ కుమార్

సెక్రటరీ

నవీన్, షేక్.షాజీద్

కార్యవర్గ సభ్యులు

కర్ర.నాగిరెడ్డి.

మామిడాల .శ్రీనివాసరావు.

సుధీర్ కుమార్.

ఆంధ్రప్రదేశ్ డిజిటల్ ప్రింట్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది...

# బాల్య దశ నుండే ప్రాథమిక

## విద్యాభ్యాసాన్ని బలపరచాలి " సూపర్వైజర్ అంకమ్మ "



**దొరవారిసత్రం : పెన్ పవర్, ఆగస్టు 24**

ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ చిన్నారులకు బాల్య దశ నుండే ప్రాథమిక అభ్యాసాన్ని బలపరిచేందుకు ప్రతి కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ అంకమ్మ సూచించారు. అందు నిమిత్తం సోమవారం రెండో విడత " జ్ఞాన జ్యోతి " అను కార్యక్రమం పై మండల కేంద్రంలో రెండో విడత శిక్షణ - అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రంలో చేరిన చిన్నారులకు ప్రాథమిక విద్యతోపాటు - ఆరోగ్య విషయాలపై ఎలాంటి చర్యలు తీసుకోవాలని అంశాలపైశిక్షణ ఇచ్చారు.5 ఏళ్లలోపు చిన్నారుల్లో సృజనాత్మకత విద్యాభివృద్ధి, చిన్నారుల ప్రవర్తన శైలి వంటి వాటినిఅభివృద్ధికి కృషి చేస్తూ, జ్ఞాన జ్యోతి కార్యక్రమాన్ని విజయవంతానికి అందరూపనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన జ్యోతి ట్రైనీ లు వినయ్ కుమార్, వెంకటేశ్వర్లు, దిలీప్, సూపర్వైజర్ అంకమ్మ, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# పొట్టి సుబ్బయ్యపాలెం తీరంలో ఉగ్రరూపం దాల్చిన సముద్రం

## రాకాసి అలలతో తీర ప్రాంతంలో కోత..

## పర్యాటకుల సముద్ర స్నానాలపై తాత్కాలిక నిషేధం





**వేటపాలెం, పెన్ పవర్, ఆగస్టు 24:**

వేటపాలెం మండలంలోని పొట్టి సుబ్బయ్యపాలెం సముద్రతీరంలో అలల ఉద్ధృతి ఒక్కసారిగా పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. భారీ అలల తాకిడికి తీర ప్రాంతం కోతకు గురవడంతో పాటు పలు చోట్ల భారీ గోతులు ఏర్పడటంతో పర్యాటకుల భద్రత దృష్ట్యా సముద్ర స్నానాలను తాత్కాలికంగా నిలిపివేశారు.అలలు తీవ్రంగా ఎగసిపడుతుండటంతో సముద్రం ముందుకు చొచ్చుకురావడంతో తీరం వెంబడి పరిస్థితిని అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. సముద్రతీరంలో ఏర్పడిన గోతుల లోతును అంచనా వేసేందుకు మెరైన్ పోలీసులు గజ ఈతగాళ్లను నీటిలోకి పంపించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.పర్యాటకులు సముద్రంలోకి దిగకుండా మెరైన్ పోలీసులు తీరం వెంబడి గస్తీ నిర్వహిస్తున్నారు. సముద్ర స్నానాలకు ప్రస్తుతం అనుమతి లేదని, పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు పర్యాటకులు అధికారుల సూచనలు పాటించాలని పోలీసులు కోరారు.ప్రతి ఏటా అమావాస్య, పౌర్ణమి సమయాల్లో అలల ఉద్ధృతి పెరిగే అవకాశం ఉంటుందని స్థానిక మత్స్యకారులు తెలిపారు. ప్రస్తుతం వాతావరణ మార్పులు, వాయుగుండం ప్రభావం కూడా సముద్రంలో అలజడికి కారణమై ఉండవచ్చని వారు పేర్కొన్నారు.సముద్ర అలజడి మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో వేటకు వెళ్లే మత్స్యకారులను కూడా అప్రమత్తం చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. అవసరమైతే వేటను తాత్కాలికంగా నిలిపివేసేలా సూచనలు జారీ చేయనున్నట్లు తెలిపారు. తీరానికి సమీపంలో అలలు ఉద్ధృతంగా ఎగిసిపడుతున్న నేపథ్యంలో పరిస్థితి పూర్తిగా సాధారణమయ్యే వరకు పర్యాటకులు సముద్రంలోకి దిగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# అండర్ పాస్ వాహనాలు పార్కింగ్.

**రొంపిచర్ల పెన్ పవర్ ఆగస్టు 24.**

రొంపిచర్ల క్రాస్- పులిచెర్ల మార్గంలో హైవే అండర్ పాస్ కింద రోడ్డుకి వేరు పైపుల వాహనం నిలపడం చేస్తున్నారు. దీంతో అండర్ పాస్ వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు . వాహనాలు నిలపడం వల్ల ప్రమాదాలు జరగవచ్చని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా వాహనాలు నిలపడం వల్ల కాలినడకన విన్న ప్రజలు రోడ్లో నడిరోడ్డు మీద వెళ్లాల్సి వస్తుంది.దీనిపై ఎస్సై మధుసూదన్ వివరణ ఇస్తూ.. అండర్ పాస్ నిలిపి ఉంచితే ఫైన్ వేస్తామని హెచ్చరించారు. వాహనదారులు ఇకనైనా గమనించి వాహనాలు అండర్ పాస్ కింద నిలపకూడదని ఎస్ఐ హెచ్చరించారు.

# పలమనేరు ప్రైవేట్ పట్టాదారుల సమస్యల పరిష్కారానికి మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశం

- వాక్ఫ్ బోర్డు నిషేధిత జాబితా నుంచి సర్వే నం. 963, 964ల తొలగింపునకు చర్యలు
- కలెక్టర్ నివేదికను పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ చేసిన మంత్రి ఫరూక్

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 24:**

పలమనేరు పరిధిలోని ప్రైవేట్ పట్టాదారుల భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ సానుకూలంగా స్పందించారు. నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పలమనేరు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖ నాయకులు మంత్రి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పలమనేరు పరిధిలోని ప్రైవేట్ రెసిడెన్షియల్ సర్వే నంబర్లు 963, 964 లను గతంలో పొరపాటున వాక్ఫ్ బోర్డు పరిధిలోకి చేర్చారని మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల స్థానిక పట్టాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సదరు సర్వే నంబర్లను వాక్ఫ్ బోర్డు నిషేధిత జాబితా నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశారు.సమస్యను సావధానంగా విన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్ చిత్తూరు జిల్లా కలెక్టర్ సమర్పించిన విచారణ (ఇన్వెస్టిగేషన్) నివేదికను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సర్వే నంబర్లు 963, 964 లను సమీక్షించి, నిషేధిత పరిధి నుంచి తొలగించి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గ నాయకులు న్యాయమతుల్లా, అబ్దుల్ ఖాదర్, సయ్యద్ మస్తాన్, రామచంద్రయ్య, ఆనంద్ బెన్ తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రవాహాలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం

**గంగవరం/రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 24:**

రానున్న వరద ప్రవాహాల నేపథ్యంలో పోలవరం జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం వరద పరిస్థితులపై అందిన తాజా పరిశీలనలు, అంచనాలను సమీక్షించిన కలెక్టర్.. అధికారులకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.తాజా అంచనాల ప్రకారం ఆగస్టు 26న భద్రాచలం వద్ద 5 నుంచి 6 లక్షల క్యూసెక్కుల వరకు వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అలాగే సబరి నదిపై కొంటా వద్ద ఆగస్టు 25వ తేదీ సాయంత్రం లేదా 26వ తేదీ తెల్లవారుజామున 1 నుంచి 1.5 లక్షల క్యూసెక్కుల వరకు వరద ప్రవాహం నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు.వరద పరిస్థితులపై అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, నదీ పరివాహక ప్రాంతాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన ముందస్తు సమాచారం అందించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో సిద్ధంగా ఉండాలని సూచించారు.వర్షపాతం, నదుల్లో నమోదవుతున్న వాస్తవ వరద ప్రవాహాలు, తాజా అంచనాలను నిరంతరం పర్యవేక్షిస్తామని కలెక్టర్ తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా తదుపరి హెచ్చరికలు, సూచనలు జారీ చేస్తామని పేర్కొన్నారు.